
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 80 వ భాగం

### వృత్తాసుర వృత్తాంతం – 4, నారదుడికి దక్షుడి శాపం

దక్షుడికి శ్రీహరి కనిపించి అసక్ని అనే కన్యతో కలిసి ప్రజోత్పత్తి చేయమని చెప్పాక ఆ ప్రజాపతి హర్యశ్వులని పుట్టించాడు కదా. వాళ్ళు తపస్సుకు బయల్దేరితే నారదుడు వాళ్ళతో మాట్లాడి వాళ్లని మోక్షపథం వైపు తిప్పాడు. అలా తన కుమారులందరూ నారాయణైక్యం చెందడం చూసి దక్షుడు వ్యాకులపడి బ్రహ్మ తో మొరపెట్టుకుంటే ఆయన మరో సారి సృష్టి చేయమని బ్రహ్మ దక్షుడికి చెప్పాడనీ, అప్పుడు శబళాశ్వులనే వారిని పుట్టించాడనీ క్రితం వ్యాసంలో చదివాం. ఈసారి పుట్టిన శబళాశ్వులు ఏం చేసారంటే,

క. పుట్టించిన జనకుని మదిఁ
బుట్టిన తలఁ పెఱిగి వారు పూనికఁ బ్రజలం
బుట్టించు వ్రతముఁ గైకొనిఁ
గట్టిగఁ దప మాచరింపఁగాఁ జనిరి వెసన్. [6-242]

వ. ఇట్లు శబళాశ్వులు ప్రజాసర్గంబు కొఱకుఁ దండ్రి పంపునం దపంబు జేయువారై యే తీర్థంబు తీర్థరాజం బై సకలతీర్థఫలంబు నాలోకన మాత్రంబునన నుగ్రహించుచు సకలపాపంబుల నిగ్రహించు, నే తీర్థ ప్రభావంబున నగ్రజన్ములు ఫలసిద్ధిం బొందుదు, రట్టి నారాయణసరస్సను పుణ్యతీర్థంబునకుం జని, తదుపస్పర్శమాత్రంబున నిర్ధూత మలాశయులై. [6-243]

వీళ్ళకి కూడా తండ్రి ప్రజోత్పత్తి చేయమని చెప్పాడు. ఆ మాటతో వీళ్ళు కూడా తపస్సు కోసం బయల్దేరారు. ఎక్కడికి? ఏ తీర్థం లో అయితే సకల పాపాలు పోతాయో, ఎక్కడైతే ఫలం సిద్ధిస్తుందో, అటువంటి నారాయణ సరస్సు అనే పుణ్యతీర్థానికి. అక్కడకి వెళ్ళగానే ఆ స్పర్శ మాత్రం చేతనే దోషాలు పోగొట్టుకుని (నిర్ధూత మలాశయులై) పవిత్రులయ్యేరు. ఓ విధంగా చెప్పుకోవాలంటే, ఆ ప్రదేశం ఋషీకేశం వంటిదన్న మాట. వెళ్ళగానే అక్కడి ఋషుల సత్సంగం వల్ల మనసు బాగా భగవంతుడిమీద కేంద్రీకరించడానికి సిద్ధంగా ఉంది.

శా. బ్రహ్మేంద్రాదులు నందనేరని పరబ్రహ్మంబుఁ జింతించుచున్
బ్రహ్మానందముఁ బొంది జిహ్వికలపై బ్రహ్మణ్యమంత్రంబులన్
బ్రహ్మలోకనవాంఛతో నిలుపుచున్ బ్రహ్మం బితండంచు మున్
బ్రహ్మజ్ఞాన గురున్ హరిం దపమునం బాటించి రబ్బాలకుల్. [6-244]

బ్రహ్మ జ్ఞాన గురుడెవరు? శ్రీహరి, ఆ శ్రీహరి మీద మనసు నిలుపుతూ, నాలికమీద బ్రహ్మణ్యమంత్రం (పరమాత్మకి చెందిన నామం) ఆడుతూండగా, బ్రహ్మేంద్రాదులకికూడా అందని పరబ్రహ్మన్ని చింతిస్తూ తపస్సు మొదలుపెట్టారు. ఈ పద్యంలో "బ్రహ్మ" అనే పదాన్ని అనేక విధాలుగా ఎలా వాడారో చూసారా?

ఆ తపం ఎలా సాగిందంటే, ఒంటికాలి మీద నించుని, శరీరం కదలకుండా, చేతులు పైకెత్తి కొంతకాలం వాయుభక్షణతో ఆ తర్వాత నిరాహారులుగా ఉంటూ దేవతలకి భయం కొల్పేలా తపస్సు సాగించారు.

వ. ఇట్లతి భయంకరంబైన తపంబు చేయుచు, నెడతెగక భగవన్మంత్రంబులు నుడువుచుఁ బ్రజాసర్గ కాములై యున్న య చ్చిన్ని బాలుర కడకు నారదుండు చనుదెంచి, పూర్వవిధంబునం బలుకుచు నిట్లనియె; భ్రాతృవత్సలులై యున్న మీరలు వేదాంతసారం బొలుకు చున్న నా వచనంబు లాదరించి, తోఁబుట్టువులు చనిన మార్గంబునఁ జనుండు; ఎవ్వరేనిం దమ యగ్రజులు చనిన మార్గంబునం దామునుం దప్పక వర్తింతు రేని నట్టివారిని విశేషధర్మం బెఱింగిన వారంద్రు; సతతంబును బుణ్యబంధువు లైన దేవతలం గూడి సుఖంబుందుం" దని బల్కి, నారదుండు చనియె; వారలును సర్వకర్మంబుల యందు నిర్మోహితులై పరమపదంబునకు నాస్పంబు లైన దేవర్షి వాక్యంబుల నాశ్రయించి.
[6-246]

ఇలా ప్రజాసర్గం కోరినవారై తపస్సు చేస్తుంటే మరో సారి నారదుడు వీళ్లని చూడ్డానికొచ్చాడు. ఇంతకు ముందు వీళ్ళ తోబుట్టువులు ఎలా బ్రహ్మ పదం చేరారో చెప్పి, మీ అగ్రజులు చూపిన దారినే మీరూ వెళ్ళండి, నేను చెప్పే విషయం విని భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టండి అంతే కానీ ఈ సంసారంలో పడవద్దు అని చెప్పేసరికి వాళ్లకి కళ్ళు తెరుచుకున్నాయి. ఎందుకు విన్నారీ దేవర్షి మాటలు? ఆయన చెప్పినది నిజం కనక.

ఉ. అప్పుడు లజ్జతోడ శబళాశ్వులు పూర్వజు లేగినట్టి యా
చొప్పున నెన్నఁడుం దిరిగి చూడని త్రోవ విశేష పద్ధతిం
దప్పక పోయిరయ్య! గుణధాములు; నేఁడును మళ్ళరేమి నేఁ
జెప్పెదఁ గాక రాక కడ చేరిన రాత్రులఁ బోలి భూవరా! [6-247]

నారద మహర్షి ఇలా చెప్పేసరికి వాళ్లకి సిగ్గు వేసింది, ఛీ, ఈ సంసారం వృద్ధి చెందడానికి చేయకూడదు తపస్సు, చేస్తే భగవంతుడికోసం చేయాలి కానీ అని. అలా వాళ్ళ పూర్వజులు చేసిననట్టూ తపస్సు చేసి వీళ్ళు కూడా ఎన్నడూ వెనక్కి తిరిగి చూసే పని లేని త్రోవలో పరమపదం చేరారు. ఎలా? గడిచిపోయిన రాత్రులు మళ్ళీ ఎప్పటికీ తిరిగి రావన్నట్టూ.

క. దక్షున కా కాలంబున
లక్షితమై యుండెఁ బెక్కు లాగుల నుత్పా
తక్షోభంబులు వానికి
రూక్షవ్యథ నొంది యా పురుష నాశంబున్. [6-248]

ఇక్కడ నారద ఉపదేశం విని శబళాశ్వులు కూడా పరమ పదం చేరుకునే సరికి దక్షుడికి అనేక ఉత్పాతాలు కనిపించాయి. దక్షుడు తన పని – అదీ భగవంతుడు చెప్పినట్టూ చేస్తుంటే ఈ నారదుడు ఆ పని కాకుండా అడ్డం పడుతున్నాడు కదా ప్రతీసారీ? దానికి తీక్షణమైన వ్యధ (రూక్షవ్యధ) కలిగింది. తన పురుష ప్రయత్నం పూర్తిగా పాడుచేసినందుకు.

చ. నెఱయఁగ సాధురూపమున నీ వతిబాలుర కాత్మజాళికిం
గఱుకున భిక్షుమార్గ మగు కందువ చెప్పితి వేల? ధూర్తవై
మఱుఁగక యుండవచ్చునె? కుమారుల నీ దురితంబు పొంద; ని
న్నొఱఁలగఁ ద్రోతు నాదు సమదోగ్ర మహాగ్రహ శాపవహ్నులన్. [6-251]

అప్పుడు నారదుడి తో చెప్తున్నాడు దక్షుడు. సాధురూపంలో వెళ్ళి వాళ్లందరికీ ఆత్మజ్ఞానం ఎవరు చెప్పమన్నారు నిన్ను? ధూర్తుడవైన నిన్ను నమ్మవచ్చా? నేను శ్రీహరి ఆజ్ఞ ప్రకారం ఈ పని చేసాను కానీ ఆ పని కాకుండా నువ్వు అడ్డం పడుతున్నావు కనక నీకు మహోగ్రమైన శాపం ఇవ్వబోతున్నాను.

వ. అది యెట్లంటేని, దేవర్షి పితృ ఋణంబులు దీర్పక కర్మవిచారంబు చేయని బాలుర మనంబులకు నైహికేచ్ఛలయందు నైరాశ్యంబు గలుగంజేసి నివృత్తిమార్గం బుపదేశించి, వారలకు నుభయలోకముల యందుఁ జెందఁ గల శ్రేయోహాని నొనర్చితి; విట్టి పాతకంబున భాగవతోత్తములలో లజ్జాహీనుండవై యశోహానిం బొంది చరింపుదు గాక; నిరపరాధులై వైరంబులేని నా పుత్రుల పట్ల ద్రోహకృత్యం బొనర్చిన నీవు దప్పఁ దక్కిన భాగవతోత్తములు సకల భూతానుగ్రహ పరవశులు; అతి కుతూహలంబున నీచేత స్నేహపాశ నికృంతనంబైన మిత్రభేదంబె కాని తదుపశమనంబు గాకుండెడు; ఇంతనుండియుఁ బురుషుండు విషయ తీక్ష్ణత్వంబు లనుభవింపక కాని తెలియకుండెడు; జ్ఞానంబు తనంతటనె కాని యొరులచే బోధింపఁబడి తెలియరాకుండెడి; నిరంతరంబును లోకసంచారియైన నీకు నే లోకంబునను నునికిపట్టు లేకుండుం గాక" యని నిర్దయుండై శాపం బిచ్చె; నంత నారదుండు తత్క్రోధవాక్యంబుల కలుగక "యట్ల కాని" మ్మని సమ్మతించి చనియె; నిట్టి శాంతభావం బెవ్వనివలనం గలుగు, నతండు సర్వాతీతుండయిన సర్వేశ్వరుం డనంబడు; మఱియు దక్షుండు దన మనోరథంబు విఫలంబగుటం జేసి యతి దుఃఖిత మనస్కుడై పొగలుచున్నఁ, బితామహుండు చనుదెంచి, మఱియుఁ బ్రజాసర్గోపాయం బుపదేశించిన నా ప్రజాపతి ప్రియభామయైన యసిక్ని యందుఁ బిత్రువత్సల లైన పుత్రికల నఱువదుండ్రం బుట్టించి; వారిలో ధర్మునకుం బదువురను, కశ్యపునకుం బదమువ్వురను, జంద్రునకు నిఱువదేడ్వురను, భూతునకు నాంగిరసునకుఁ గృశాశ్వునకు నిద్దఱేసిచొప్పున నార్వురను, తార్క్షుండను నామాంతరంబుఁ దాల్చిన కశ్యపునకు మరలఁ గడమ నలువురను నీ క్రమంబున నిచ్చె వారి నామంబు లాకర్ణింపుము. [6-252]

ఆ శాపం ఇచ్చేముందు, ఎందుకిస్తున్నాడో చెప్తున్నాడు. మనిషిగా పుట్టాక దేవర్షి, పితృ ఋణాలని తీర్చాలి. అలా చేయకుండా ఉండడానికి నా కొడుకులందరికీ ఐహికమైన కోరికల్లో నైరాశ్యం కలగచేసి (ప్రవృత్తి మార్గంలోంచి తప్పించి) నివృత్తి మార్గం ఉపదేశించావు. అందువల్ల వాళ్ళు ఇహపరాల్లో పనికిరాకుండా చేసావు. ఈ పని వల్ల "ఉత్తములైన భగవద్భక్తుల మధ్య సిగ్గులేకుండా తిరుగుతూ అప్రతిష్ఠను పొందుతావు; నిష్కల్మలైన నా కుమారులకు ద్రోహం చేసినందుకు త్రిలోక సంచారివై ఒకచోట నిలుకడ లేకుండా ఉంటావు గాక" అని నిర్దాక్షిణ్యంగా శపించాడు. శాపం తీసుకున్న నారదుడు "సరే ఆలాగే కానీ" అని ఊరుకున్నాడు శాంతంగా కానీ తిరిగి శాపం పెట్టగలవాడై ఉండీ ఏమీ చేయలేదు. అటువంటి శాంత స్వభావం ఉన్నవాడే భగవంతుణ్ణి చేరుకున్న సర్వేశ్వరుడు అనబడతాడు, ఎందుకంటే అటువంటి వారు కోపతాపాలని నిగ్రహించి అన్నింటికీ అతీతులైనవారు కనక.

ఇప్పటికి దక్షుడు రెండు సార్లు కొడుకులని పుట్టించినా ఏమీ ప్రయోజనం లేకపోయేసరికి మరోసారి బ్రహ్మని చూడడానికి బయల్దేరాడు. ఈ సారి ఆయన చెప్పిన ప్రకారం అసక్ని వల్ల అరవై మంది కూతుళ్ళని పుట్టించాడు. వాళ్లలో ధర్మదేవతకి పదిమందినీ, కశ్యపుడికి పదముగ్గురిని (హిరణ్యాక్ష హిరణ్యకశిపులు పుట్టిన అదితి, వామనుడు, ఆదిత్యులు పుట్టిన దితి ఇందులో వారే), చంద్రుడికి ఇరవై ఏడుగురినీ అలా మిగతా వారందరినీ ఇచ్చి పెళ్ళిచేశాడు.

ఆ. ఎట్టి పుణ్యవతులొ? యీ చేడియలు చెప్ప
సవతు లేనియట్టి సవతులయ్యుఁ
గడుప పడసి రెట్టి కడుపునఁ బుట్టిరో
కడిఁది త్రిజగ మెల్లఁ గడుపు గాఁగ . [6-253]

దక్షుడి కూతుళ్ళు ఇంతింతని చెప్పలేని పుణ్యాత్ములు. చాలామంది ఒకరికొకరు సవతులైనా ఎటువంటి పోరూలేకుండా సంసారాలు చక్కగా దిద్దుకున్నారు. అలాగే త్రిజగాలనీ పుట్టించారు. గరుడులు (వినత వల్ల), నాగులు (కద్రువ వల్ల), అలా మొత్తం ప్రజోత్పత్తి సాగింది.

ఈ దక్షప్రజాపతి కూతుళ్లలో సతీ దేవి పరమేశ్వరుణ్ణి వరించి, దక్ష యజ్ఞవినాశనంలో దేహం చాలించి ఆ పై జన్మలో ఆయనకి అర్థనారీశ్వరి అయింది. ఆ యజ్ఞంలోనే పూషుడు భర్గుని జూచి నోరంతా కనపడేటట్టూ నవ్వాడు. వీరభద్రుడు ఆ తర్వాత సాగించిన వినాశనంలో పూషుడి దంతాలని ఊడపెరికేసరికి అప్పట్నుండీ మెత్తటి పదార్థాలే తినడం సాగిస్తున్నాడు. త్వష్ట అనేమనువుకి రచన అనే కన్య వలన విశ్వరూపుడనే బలాఢ్యుడు పుట్టాడు. ఇక్కడ సృష్టి ఇలా జరుగుతూ ఉండగానే ఓ సారి ఇంద్ర సభలో దేవేంద్రుడు ఎందుకోగానీ దేవగురువు బృహస్పతిని చూసీ చూడనట్టు పట్టించుకోలేదు. ఆ తిరస్కారం చూసి బృహస్పతి కి కోపం వచ్చి ఇంక నేను దేవతలకి గురువుగా ఉండనూ అని వెళ్ళిపోయాడు. గురువు లేకుండా దేవేంద్రుడు ఏమీ చేయలేడు కనక బ్రహ్మ ఇచ్చిన ఆదేశం ప్రకారం విశ్వరూపుణ్ణి ఆచార్యుడిగా చేసుకున్నారు.

శుకయోగి కథ ఇలా చెప్పేసరికి పరీక్షిత్తు అడుగుతున్నాడు, “ఈ దేవతలమీద బృహస్పతికి కోపం ఎందుకొచ్చింది? అసలు ఇటు గురువు కానీ శిష్యుడు కానీ ఏదో తప్పు చేసి ఉండాలి కదా?”

కథలో ఇప్పటివరకూ చూసినది ఏమంటే శ్రీహరి చెప్పినది విని దక్షుడు ప్రజాపతిగా తన పురుష ప్రయత్నం చేసాడు. ఆ ప్రయత్నంలో ప్రతీసారీ నారదుడు అడ్డుకుంటూంటే, ఆయనకి శాపం ఇచ్చి బ్రహ్మ ఆదేశం ప్రకారం ఆ తర్వాత కన్న కూతుర్లని తలొకరికీ ఇచ్చి పెళ్ళి చేసాక సంతానం వృద్ధి అయింది. ఈ క్రమంలోనే రచన అనే ఆవిడకి విశ్వరూపుడనే వాడు పుట్టుకొచ్చేడు. ఈయన బృహస్పతి అంతటివాడు. ముందు జరగబోయే కథ – దేవతల్లో ఏవో తేడాలు రావడంతో ఈ బృహస్పతి దేవసభలోంచి వెళ్ళిపోతే ఆయన స్థానంలో ఈ విశ్వరూపుణ్ణి కూర్చోబెట్టారు. ఇక్కడినుంచి అసలు కథ మొదలౌతుంది — వృత్తాసురుడు పుట్టడం, అతన్ని చంపడానికి దేవేంద్రుడు పడే కష్టాలూ, ఆ యుద్ధంలో భాగంగా నారాయణ కవచం అనేదీ, ఒక్కోటిగా వస్తాయి. వృత్తాసురుణ్ణి చంపాక దేవంద్రుడు ఆ బ్రహ్మ హత్యాపాతకం వదిలించుకోవడానికి పడే అష్టకష్టాలూ, అశ్వమేధం చేయడం అవన్నీ సింగన గారి పద్యాల్లో ముందు ముందు వ్యాసాల్లో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS